నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 20 డిసెంబర్ 2023 | NIZAMABAD

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో నిర్వహించనున్న అయ్యప్ప ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను మంగళవారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు రాజ్‌వీర్, ఏపీ భాజన్న, బోగ శ్యామ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

- కమ్మర్‌పల్లి, డిసెంబర్ 19

ప్రశాంత్ ఇంటి ముట్టడికి గ్రామస్తుల యత్నం

మాక్లూర్, డిసెంబర్ 19 : ఆస్తి కోసం ఆరుగురిని హత్య చేసిన మాక్లూర్‌కు చెందిన నిందితుడు ప్రశాంత్ ఇంటిని ముట్టడించేందుకు గ్రామస్తులు మంగళవారం యత్నించారు. సర్పంచ్ అశోక్‌రావును సైతం గ్రామస్తులు ఘెరావ్ చేశారు. నిందితుడికి తగిన గుణపాఠం చెప్పాలన్న ఉద్దేశంతో అతడి ఇంటిని కూల్చివేసేందుకు యత్నించడంతో సమాచారం అందుకున్న నార్త్ రూరల్ సీఐ సతీష్, ఎస్సై సుధీర్‌రావు బలగాలతో వెళ్లి గ్రామస్తులను అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిందితుడు ప్రశాంత్ ఇంటి ముందు బందోబస్తు

అప్పుడే స్పందించి ఉంటే?

సోన్ వద్ద తొలి మృతదేహం లభ్యం...
డిసెంబర్ 8 నాడే వెలుగు చూసిన ఘటన
జాడను గుర్తించడంలో పోలీసుల వెనుకబాటు
డిసెంబర్ 13 ఘటనతో కామారెడ్డిలో అప్రమత్తం
సదాశివనగర్ పోలీసుల దర్యాప్తుతోనే బట్టబయలు

నిజామాబాద్, డిసెంబర్ 19, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరుస హత్యల ఘటనలో కామారెడ్డి పోలీసుల తక్షణ స్పందనతో దుండగులు రోజుల వ్యవధిలోనే చిక్కి కటకటాల పాలయ్యారు. డిసెంబర్ 13న ఈ ఘటనల్లో ప్రధాన సూత్రధారి ప్రశాంత్ అతని స్నేహితులు కలిసి ప్రసాద్ చెల్లెలు స్వప్నను హత్య చేశారు. భూంపల్లి శివారులో చంపేసి పెట్రోల్ పోసి నిప్పటించారు. మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకుని లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఒక హత్యతో మరో హత్యకు సంబంధించిన లింకు దొరకడంతో హుటాహుటిన కామారెడ్డి పోలీసులు చూపించిన చొరవతో హంతకుల ప్లాన్‌ను చివరి దశలో నిలువరించగలిగారు. ఆరు హత్యలు చేసిన నిందితులు ప్రసాద్ తల్లి సుశీలను సైతం చంపాలని చూశారు. కానీ పోలీసుల రంగప్రవేశంతో నిలువరించగలిగారు.

సీన్ కట్ చేస్తే...

డిసెంబర్ 13 ఘటనతో హత్యాకాండ వెలుగు చూడగా అంతకు ముందే నిజామాబాద్ జిల్లా మెండోరా మండల శివారులో నిజామాబాద్-నిర్మల్ జిల్లాల సరిహద్దులోనూ ఇలాంటిదే వెలుగు చూసింది. డిసెంబర్ 4న నిజామాబాద్‌కు ప్రసాద్ పిల్లలను హంతకుడు మేడిద ప్రశాంత్, అతని తమ్ముడు కలిసి బయటికి పట్టుకొచ్చారు. కిరాయి తీసుకున్న కారులో ఎక్కించుకుని సోన్ బ్రిడ్జి వద్దకు వచ్చారు. కవల పిల్లలైన చైత్రిక, చైత్రిక్‌లను చంపేసి వంతెనపై నుంచి కింద పడేశారు. నిర్మానుష్య ప్రాంతం కావడంతో హత్య ఘటన ఆలస్యంగా డిసెంబర్ 8న పోలీసులకు తెలిసింది. గుర్తు పట్టరాని విధంగా మారిన మృతదేహాన్ని గుర్తించిన స్థానిక పోలీసులు మిస్సింగ్ కేసుల వైపే శోధన జరిపారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. కానీ వీరికి ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఒక వేళ మెండోరా పోలీసులు ఇతరత్రా మార్గాలను అన్వేషించి అప్రమత్తమై ఉండి ఉంటే డిసెంబర్ 13న జరగాల్సిన స్వప్న హత్యను నిలువరించే పరిస్థితి ఉండేదని మాక్లూర్ వాసులు భావిస్తున్నారు.

కేసు వివరాలను వెల్లడిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

కటకటాల్లోకి కిరాతకులు

- అప్పు ఎగ్గొట్టేందుకు.. ఆస్తి కొల్లగొట్టేందుకు ప్రశాంత్ పన్నాగం
- మైనర్ అయిన తమ్ముడు, మరో ఇద్దరితో కలిసి దారుణం
- సహకరించిన ప్రశాంత్ తల్లి .. ఐదుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ

రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రధాన నిందితుడైన ప్రశాంత్, సోదరుడు మైనర్‌తో పాటు హత్యల కోసం ఒప్పందం చేసుకున్న మరో ఇద్దరు యువకులను కామారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. పరోక్షంగా సహకరించిన ప్రశాంత్ తల్లి వడ్డెమ్మను సైతం అరెస్టు చేశారు. కామారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సింధూశర్మ మంగళవారం వివరాలను వెల్లడించారు. ఆస్తి కోసమే వరుస హత్యలు చేశాడని.. ప్రసాద్ కుటుంబాన్ని అంతమొందించి ఆస్తి మొత్తం కాజేయాలనే కుట్రతోనే ఈ దుర్మార్గానికి ఒడిగట్టాడని వివరించారు.

నిజామాబాద్, డిసెంబర్ 19, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / కామారెడ్డి : సంచలనం సృష్టించిన ఆరు హత్య కేసుల నిందితులు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. సదాశివనగర్ మండలం భూంపల్లిలో లభ్యమైన ఓ యువతి హత్య కేసును ఛేదిస్తున్న క్రమంలో దుర్మార్గులు చిక్కారు. మొత్తం నలుగురు నిందితులు కాగా వీరిలో ప్రశాంత్ ఒక్కడికే 25 ఏండ్లు. ప్రశాంత్ తమ్ముడు మైనర్ కాగా వీరికి సహాయ పడిన మరో ఇద్దరు బానోతు విష్ణు, బానోతు వంశీ వయస్సు కేవలం 19 ఏండ్లు మాత్రమే. రూ.మూడున్నర లక్షల అప్పును ఎగ్గొట్టేందుకు, రూ.20-25లక్షల విలువ చేసే ప్రసాద్ ఆస్తిని కొల్లగొట్టేందుకు పథకం ప్రకారం హత్యలు చేశారు. వీరికి ప్రశాంత్ తల్లి వడ్డెమ్మ సైతం పరోక్షంగా సహకరించింది. వీరందరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ మీడియా సమావేశంలో మంగళవారం వెల్లడించారు.

కలిసొచ్చిన ప్రసాద్ గత వ్యవహారం...

ప్రసాద్ 2018లో మాక్లూర్‌కు చెందిన ఒక అమ్మాయిని మోసం చేయగా ఆమె ఆత్మహత్య చేసుకున్నది. ప్రసాద్‌పై సెక్షన్ 354డీ, ఐపీసీ 306 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అప్పటికే దుబాయ్‌లో ఉండగా ఈ కేసు పెండింగ్‌లో ఉంది. 2022 అక్టోబర్‌లో స్వగ్రామానికి ప్రసాద్ రావడంతోనే పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించగా బెయిల్‌పై బయటికి వచ్చాడు. దుబాయ్‌లో ఉన్నప్పుడే మేడిద ప్రశాంత్‌కు.. పూనే ప్రసాద్ రూ.3.5లక్షలు అప్పు ఇచ్చాడు. జైలు నుంచి తిరిగొచ్చాక ప్రసాద్ కుటుంబానికి మాక్లూర్‌లో నివసించే పరిస్థితులు లేకపోవడంతో కామారెడ్డి జిల్లా పాల్వంచకు మకాం మార్చారు. ఈ క్రమంలో అప్పులు కావడంతో తానిచ్చిన డబ్బులను తిరిగి చెల్లించాలంటూ ప్రశాంత్‌పై ప్రసాద్(36) ఒత్తిడి చేశాడు. మాక్లూర్‌లో రూ.25లక్షలు విలువ చేసే రెండు ఇండ్లు, ఒక జాగాను కుదువ పెట్టే ప్రయత్నం చేయగా సఫలీకృతం కాలేదు. ఈ క్రమంలోనే ప్రశాంత్‌ను సంప్రదించగా తన పేరిట ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసిస్తే లోన్ ఇప్పిస్తానని చెప్పడంతో ప్రసాద్ నమ్మి రిజిస్ట్రేషన్ చేయించాడు. తీసుకున్న అప్పు, ఇండ్ల పేరిట ఇస్తానన్న లోన్ సంగతి ఏమిటని ప్రశ్నించగా ప్రశాంత్ తప్పించుకుని తిరగడం మొదలు పెట్టాడు. ప్రసాద్, ఆయన కుటుంబీకులను చంపేస్తే ఆస్తులు తనకే చెందుతాయని ప్రశాంత్ భావించాడు. ఇందులో భాగంగానే హత్యకు మాక్లూర్ శివారులోని దాస్‌నగర్ తండాకు చెందిన బానోతు విష్ణు, బానోతు వంశీతో రూ.60వేలకు ఒప్పందం చేసుకొని ఆరుగురిని హత్య చేశాడు. వీరితో పాటు ప్రశాంత్ తమ్ముడు మైనర్ సైతం చేతులు కలిపినట్లుగా ఎస్పీ సింధూ శర్మ చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ రామన్, ఎస్సై రాజు, కానిస్టేబుళ్లు అశోక్, జానకీరామ్, రవికుమార్, అబ్దుల్ హమీద్, శశికాంత్, నరేశ్, సుధాకర్ రెడ్డి, హోంగార్డు అరుణ్‌లను ఎస్పీ అభినందించారు.

పక్కా ప్లాన్ ప్రకారమే...

ప్రసాద్ తల్లి సుశీల, అతని పిల్లలు చైత్రిక(8), చైత్రిక్(8), ఇంకో చెల్లెలు స్వప్న(26)ను భయభ్రాంతులకు గురి చేసి నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో ఉంచారు. ప్రధాన నిందితుడు ప్రశాంత్ తన తల్లి వడ్డెమ్మను వీరితో పాటే ఉంచాడు. ప్రసాద్ తన పిల్లలను చూడాలని అంటున్నారని చెప్పి లాడ్జిలో ఉన్న చైత్రిక, చైత్రిక్‌ను డిసెంబర్ 4న తన తమ్ముడిని వెంటేసుకుని కారులో సోన్ బ్రిడ్జి వైపు వెళ్లారు. పిల్లలను గొంతు నులిమి చంపి వంతెన కింద కాలువలో పడేశారు. భార్య పిల్లలతో ప్రసాద్ ఒకే చోట క్షేమంగా ఉన్నారని నమ్మబలికారు. డిసెంబర్ 13న లాడ్జిలో ఉన్న ప్రసాద్ మరో చెల్లెలు స్వప్న(దివ్యాంగురాలు)ను కారులో ఎక్కించుకుని గాంధారి ఎక్స్‌రోడ్డు సమీపంలోని భూంపల్లి శివారులో గొంతుకు తాడు బిగించి చంపేసి పెట్రోల్ పోసి కాల్చి వేశారు. ప్రసాద్ తల్లి సుశీలను సైతం హత్య చేయాలని భావించిన సమయంలో ఆమె తప్పించుకున్నది. డిసెంబర్ 14న వెలుగు చూసిన ఓ యువతి హత్య కేసును ఛేదిస్తున్న క్రమంలో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో నిందితులు మేడిద ప్రశాంత్, బానోతు విష్ణు, బానోతు వంశీ, మరో మైనర్ బాలుడిని పాల్వంచ వద్ద పోలీసులు పట్టుకుని వివరాలు ఆరా తీయగా ఆరు హత్యల విషయం బయటపడింది. నిందితుల నుంచి కారు, ఒక బైక్, భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, రూ.30వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, తాడు, 2 పెట్రోల్ బాటిళ్లు, పుస్తెలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు.

నవంబర్ 29 నుంచి డిసెంబర్ 13 దాకా...

మాక్లూర్ గ్రామానికి నవంబర్ 29న వచ్చిన ప్రసాద్ నేరుగా ప్రశాంత్ ఇంటికెళ్లి ఎలాగైన తన డబ్బులిచ్చేయాలని ఒత్తిడి చేశాడు. ఇదే అదనుగా భావించిన నిందితుడు బానోతు విష్ణు, బానోతు వంశీలతో సంప్రదింపులు జరిపాడు. నిజామాబాద్‌లో ఓ వ్యక్తి వద్ద కారును కిరాయికి తీసుకుని వచ్చి మద్యం సేవిద్దామంటూ ప్రసాద్‌తో కలిసి మాక్లూర్ మండలం మదనపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. మద్యం మత్తులో ముంచిన తర్వాత కట్టెలు, రాళ్లతో ప్రసాద్ తలపై మోది చంపేసి అక్కడే చెట్ల పొదల్లో పడేశారు. అర్ధరాత్రి మాక్లూర్‌కు వచ్చి పార, గడ్డపారలను తీసుకు వచ్చి అడవిలోనే ప్రసాద్‌ను పూడ్చిపేశారు. ప్రసాద్ కనిపించడం లేదని కుటుంబీకులు ఎవరైనా పోలీసులను సంప్రదిస్తారని భావించి డిసెంబర్ 1న పాల్వంచ గ్రామానికి ప్రశాంత్ ఒక్కడే వెళ్లాడు. గతంలో యువతి ఆత్మహత్య కేసు విషయంపై ప్రసాద్ కోసం పోలీసులు తిరుగుతున్నారని ఆయన భార్య శాన్విక(29), చెల్లెలు శ్రావణి(23)లను భయపెట్టి నిజామాబాద్‌కు తీసుకు వచ్చారు. భర్త దగ్గరికి పోదామని చెప్పి శాన్వికను బాసర బ్రిడ్జి వైపు తీసుకెళ్లి ముగ్గురు కలిసి గొంతు నులిమి చంపేసి గోదావరి నదిలో పడేశారు. అన్నా వదినల దగ్గరికి వెళ్దామని మాయమాటలు చెప్పి శ్రావణిని కారులో ఎక్కించుకుని మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం శివారులో జాతీయ రహదారి 44 పక్కన గొంతు బిగించి చంపేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు.

హత్య కేసు నిందితుల్లో ఒకడు మైనర్
ప్రశాంత్‌తో చేతులు కలిపిన ఇద్దరికి 19 ఏండ్లే

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

దివ్యాంగులను సత్కరిస్తున్న కలెక్టర్,ఎమ్మెల్యే

నిజామాబాద్ క్లైం,డిసెంబర్ 19: దివ్యాంగులు ఏ రంగంలోనూ ఎవరికీ తీసిపోరని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో దివ్యాంగులు ప్రదర్శిస్తున్న ప్రతిభా పాటవాలను గుర్తు చేస్తూ కలెక్టర్ కొనియాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రంగాల్లో దివ్యాంగులకు చేయూతనందిస్తున్నాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ దివ్యాంగులకు అండగా ఉంటానని అన్నారు. వారికి మౌలిక వసతులు,విద్య, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్ దండు నీతూ కిరణ్, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు సూదం లక్ష్మి, డీఆర్డీవో చందర్, డీడబ్ల్యూవో రసూల్ బీ, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వుల్లో పొరపాటు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 19: రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. పొరపాటున మార్క్‌ఫెడ్ సంస్థ పేరును కూడా చేర్చి ఆ సంస్థ చైర్మన్ పదవిని రద్దు చేసింది. కాగా సభ్యుల ద్వారా ఎన్నికైన మార్క్‌ఫెడ్ చైర్మన్ ఐదేండ్ల వరకు పదవిలో కొనసాగుతారు. ఈ విషయాన్ని గ్రహించిన రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులను సవరించి మరలా జీవో విడుదల చేసింది. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా మార గంగారెడ్డి 2025 మార్చి వరకు పదవిలో కొనసాగనున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, డిసెంబర్ 19 : కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో తెలుగు సబ్జెక్టు బోధించేందుకు అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పాసై ఉండాలని తెలిపారు. కళాశాల విద్యా కమిషనర్ నిబంధనల ప్రకారం ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా కామరెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 23వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు.

రానున్న ఐదు రోజులు మరింత చలి తీవ్రత

కేవీకే వాతావరణ శాస్త్రవేత్త శ్రీలక్ష్మి

రుద్రూర్, డిసెంబర్ 19 : రానున్న ఐదు రోజులు జిల్లాలో చలి తీవ్రత పెరగనున్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కేవీకే వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈశాన్య, తూర్పు దిశల నుంచి రాష్ట్రం వైపు వీస్తున్న గాలుల ప్రభావంతో రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు 14.3 నుంచి 15.8 డిగ్రీల వరకు పడిపోవచ్చన్నారు. నాలుగు నుంచి ఏడు కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు నారుమడిలో చలితీవ్రతను తగ్గించడానికి సాయంత్రం నీరు పెట్టి ఉదయం తీసేయాలని లేదంటే ప్లాస్టిక్ షీట్లను నారుమడిపై కప్పి ఉంచాలని సూచించారు. 2 క్వింటాళ్ల మాగిన కోళ్ల లేదా గొర్రెల ఎరువు లేదా వర్మి కంపోస్టు ఎరువు వాడి వెచ్చదనం పెంచాలన్నారు. ఐదు రోజుల పాటు ఉష్ణోగ్రతల్లో మార్పు అధికంగా ఉండే అవకాశం ఉండడంతో ప్రజలు రాత్రి ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు.

దివ్యాంగులు అధైర్యపడొద్దు

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారివిఠల్‌రావు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 19: దివ్యాంగులు అధైర్యపడొద్దని నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి హాజరై మాట్లాడారు. దివ్యాంగులపై చిన్నచూపు వద్దన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ వారు ప్రతిభ చూపుతున్నారని గుర్తుచేశారు. దివ్యాంగులకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అండగా ఉంటారన్నారు. స్నేహ సొసైటీలో ఉన్న దివ్యాంగులు చదువుతోపాటు క్రీడలు, వివిధ కళల్లో ఆరితేరడం అభినందనీయమని అన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, నగర మేయర్ దండు నీతూకిరణ్, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిణి రసూల్‌బీ, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, రాజేశ్వరీదేవి పాల్గొన్నారు.

కాలువలో పడి విద్యార్థి మృతి

ఎండీ ఫర్హాన్ (ఫైల్), పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఉపాధ్యాయుల నిర్లక్ష్యమేనంటూ గ్రామస్తుల ఆందోళన

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 19: బాన్సువాడ మండలంలోని కొత్తాబాది ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విషాదం చోటు చేసుకున్నది. ఒకటో తరగతి చదువుతున్న ఎండీ.ఫర్హాన్(6) ప్రమాదవశాత్తు పాఠశాల వెనుక ఉన్న నిజాంసాగర్ ఉపకాలువలో పడి మృతి చెందాడు. కాలువలో పడిన కొద్దిసేపటికే తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు సమాచారం అందించగా, అప్పటికే విద్యార్థి మృతి చెందాడు. ఆసిఫా, ఉస్మాన్ దంపతులకు ఒక్కగానొక్క సంతానం ఫర్హాన్. మధ్యాహ్నమే వచ్చి కొడుక్కి భోజనం తినిపించి వెళ్లానని, కొద్దిసేపటికే కాలువలో పడి మరణించాడని తల్లి రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కుటుంబీకులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ధర్నాకు దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా పాఠశాల హెచ్ఎం ఉదయం వచ్చి రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు గుర్తించారు. ఈ విషయమై ఎంఈవో నాగేశ్వర్‌రావును వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేకుండా హెచ్ఎం సంతకం పెట్టి వెళ్లాడని, అతనిపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం

ఖలీల్‌వాడి/నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 19 : నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో నగరంలోని మున్నూరుకాపు సంఘంలో ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు.

కార్యక్రమం లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, షబ్బీర్‌అలీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, పార్టీ నగర అధ్యక్షుడు కేశ వేణు, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ సంజయ్‌కు అవమానం..

సమ్మేళనంలో పార్టీ నాయకులందరూ మాట్లాడారు. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి వేదికపైనే ఉన్న మాజీ మేయర్ సంజయ్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు మండవ వెంకటేశ్వర్‌రావు ఆలస్యంగా వచ్చినప్పటికీ ఆయనను సంజయ్ కూర్చున్న సీట్లో కూర్చోపెట్టడాన్ని జీర్ణించుకోలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. సంజయ్ అనుచరులు సైతం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలి

కామారెడ్డి, డిసెంబర్ 19: రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై సమీక్ష నిర్వహించారు. మూడు కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాల్లో కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు, ఒకేచోట మూడు కేంద్రాలు ఉన్న వాటిని పక్కన ఉండే భవనాల్లోకి మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే ఫారం-8 ద్వారా బూత్ లెవల్ అధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓటు ఉంటే వాటిలో ఒక దానిని తొలగించుకునేలా చూడాలన్నారు. జనవరి 6న డ్రాఫ్ట్ రోల్ ప్రదర్శిస్తామని, జాబితాలో ఎలాంటి తప్పులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వలస వెళ్లిన ఓటర్ల వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు అనిల్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు నరేందర్, ఖాసీం అలీ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్నకలెక్టర్ జితేశ్ వీ పాటిల్

ఎల్లారెడ్డి కోర్టులో ముగ్గురి రిమాండ్..

ఎల్లారెడ్డి, డిసెంబర్ 19 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సంచలనం రేపిన ఆరుగురి హత్య కేసుకు సంబంధించిన నిందితులను ఎల్లారెడ్డి కోర్టులో మంగళవారం రాత్రి రిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో హత్య కేసు వివరాలను ఎస్పీ సింధూశర్మ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనంతరం ముగ్గురు నిందితులను ఎల్లారెడ్డి మున్సిఫ్ మెజిస్ట్రేట్ హారిక ఎదుట హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. మేడిద ప్రశాంత్, బానోత్ విష్ణు, బానోత్ వంశీలను న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచిన అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇంటిని మంజూరు చేయాలని గొడవ..

సర్పంచ్‌పై యువకుడి దాడి..

పంచాయతీ కార్యాలయంలో ఫర్నిచర్ దహనానికి యత్నం

పంచాయతీ కార్యాలయంలో కాలిపోయిన పత్రాలు

భిక్కనూరు, డిసెంబర్ 19 : డబుల్ బెడ్ రూం ఇంటి విషయంలో గొడవకు దిగిన ఓ యువకుడు సర్పంచ్‌పై దాడి చేయడమే కాకుండా పంచాయతీ కార్యాలయంలోని ఫర్నిచర్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం సిద్ధరామేశ్వరనగర్‌కు చెందిన గంధం రంజిత్ డబుల్ బెడ్ రూం మంజూరు విషయమై సర్పంచ్ జనగామ శ్రీనివాస్‌తో మంగళవారం వాగ్వాదానికి దిగాడు. ఇంటిని మంజూరు చేయాలని నానా దుర్భాషలాడాడు. రంజిత్ తల్లి పేరిట మరో వారం రోజుల్లో ఇంటిని ఇవ్వొచ్చని.. అధికారులను కనుక్కుందామని సర్పంచ్ చెబుతుండగానే కోపోద్రిక్తుడైన రంజిత్ పెట్రోల్ తీసుకెళ్లి పంచాయతీ కార్యాలయంలోని ఫర్నిచర్‌పై పోసి తగులబెట్టాడు. సర్పంచ్ శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ప్రభుత్వ ఆస్తులను దహనం చేయవద్దని వారించారు. అయినప్పటికీ రంజిత్ సర్పంచ్ శ్రీనివాస్‌పై సైతం పెట్రోల్ పోయడంతో ఆయన అక్కడి నుంచి తప్పించుకొని వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. సర్పంచ్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రంజిత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.